# ఆగని రైళ్లు.. అవస్థల్లో ప్రయాణికులు

- రైలు ఎక్కాలంటే ఇతర స్టేషన్లకు వెళ్లాల్సిందే.
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు.
- ఆదాయం ఉన్నా సౌకర్యాలు కల్పించని వైనం

మందమర్రి, డిసెంబర్ 10: సింగరేణి పారిశ్రామిక ప్రాంతమైన మందమర్రి రైల్వే స్టేషన్‌లో రైళ్లు ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి బొగ్గు రవాణాకు ప్రధాన కేంద్రమైన రైల్వే స్టేషన్‌లో భాగ్యనగర్, ఇంటర్ సిటీ, పుష్‌పుల్ రైళ్లు మినహా ఇతర రైళ్లు ఆగడం లేదు. సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్న మందమర్రిలో ఎక్కువ శాతం కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్ జిల్లాలకు చెందిన వారు ఇక్కడికి వలస వచ్చి బొగ్గు గనుల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. పట్టణానికి చెందిన ప్రజలు నిత్యం వందలాది సంఖ్యలో వివిధ పనులపై స్వగ్రామాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. సింగరేణి ప్రధాన కార్యాలయంతో పాటు సింగరేణి ప్రధాన దవాఖాన కొత్తగూడెంలో ఉండడంతో తరుచూ ఇక్కడి ఉద్యోగులు కొత్తగూడెం వెళ్లి వస్తుంటారు. కార్మిక కుటుంబాలతో పాటు కార్మికేతర కుటుంబాల ప్రజలు వివిధ అవసరాల పై కాజీపేట, కొత్తగూడెం వైపు వెళ్లే రైళ్లలో ప్రయాణం చేస్తుంటారు. గతంలో భాగ్యనగర్, ఇంటర్ సిటీ, పుష్‌పుల్ రైళ్లతో పాటు సింగరేణి, రామగిరి రైళ్లు ప్రయాణికులకు అందుబాటులో ఉండేవి. కరోనా తర్వాత వివిధ కారణాలతో రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేసింది. అనంతరం రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించిన ప్పటికీ మందమర్రి రైల్వేస్టేషన్‌లో సింగరేణి, సిర్పూర్ కాగజ్‌నగర్(పాత తెలంగాణ), రామగిరి రైళ్లను నిలపడం లేదు. దీంతో ప్రయాణికులు మంచిర్యాల, రామకృష్ణాపూర్ రైల్వే స్టేషన్లను ఆశ్రయించాల్సి వస్తున్నది. సింగరేణికి ప్రధాన కేంద్రమైన మందమర్రి రైల్వే స్టేషన్‌లో సింగరేణి రైలు నిలుపకపోవడంతో తరచూగా కొత్తగూడెం వెళ్లే సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి, రామగిరి రైలు ఎక్కాలంటే రామకృష్ణాపూర్ లేదా మంచిర్యాల రైల్వే స్టేషన్‌లకు వెళ్లాల్సిందే.


రైల్వే స్టేషన్‌లో ఖాళీగా ఉన్న ట్రాక్‌లు

**ప్రయాణికులపై ఆర్థిక భారం..**

మందమర్రి పట్టణం, మండలం నుంచి నిత్యం వందలాది సంఖ్యలో ప్రజలు వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. రైల్వే స్టేషన్‌లో రైళ్లు నిలుపక పోవడం వల్ల తాము ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. రామకృష్ణాపూర్, మంచిర్యాల రైల్వే స్టేషన్లకు ఎక్కువగా ఆటోల్లో ప్రయాణం చేస్తుంటారు. ఆటోలకు ఒక్కొక్కరికీ సుమారు రూ.50లు చెల్లించాల్సి వస్తుందని వారంటున్నారు. గతంలో సింగరేణి, రామగిరి రైళ్లు మందమర్రి రైల్వే స్టేషన్‌లో నిలిపిన సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని అవసరమైతే నడుచుకుంటూ వెళ్లి రైలు ప్రయాణం చేసే వారమని వారు తెలిపారు. ఇప్పుడు సింగరేణి రైలు ఎక్కేందుకు వందలాది రూపాయలను వెచ్చించి రామకృష్ణాపూర్, మంచిర్యాల స్టేషన్లకు వెళ్తున్నామని వారు తెలిపారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గు రవాణాకు ప్రధాన కేంద్రమైన మందమర్రి రైల్వే స్టేషన్‌లో రద్దు చేసిన అన్ని రైళ్లను నిలపాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్

**సదుపాయాలు అంతంత మాత్రమే..**

బొగ్గు రవాణాతో మంచిర్యాల, బెల్లంపల్లి తర్వాత రైల్వే శాఖకు ఆదాయం సమకూరుస్తున్న మందమర్రి రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోవడంతో భాగ్యనగర్, ఇంటర్ సిటీ, పుష్‌పుల్ రైళ్లలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. టికెట్ కౌంటర్ ఒక పక్క ఫ్లాట్‌ఫాం మరో పక్క ఉండడంతో పాటు మరుగుదొడ్లు, తాగునీరు అందుబాటులో లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కనీసం స్టేషన్‌లో రిజర్వేషన్ సౌకర్యం లేక పోవడంతో ఇతర స్టేషన్‌లకు వెళ్లాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. రైల్వే శాఖ అధికారులు దృష్టిని సారించి మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించాలని వారు కోరుతున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం..**

**- సీపెల్లి సాగర్ మందమర్రి**



మందమర్రి రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలపక పోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సింగరేణి, సిర్పూర్ కాగజ్‌నగర్, రామగిరి తదితర రైళ్లలో ప్రయాణించేందుకు తప్పని సరి పరిస్థితిలో మంచిర్యాల, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ రైల్వే స్టేషన్‌లకు వెళ్లాల్సి వస్తున్నది. ఇందుకు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ నష్టపోవాల్సి వస్తున్నది. రైల్వే శాఖ అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను గ్రహించి రద్దు చేసిన రైళ్లను నిలపాలి.

**సదుపాయాలను కల్పించాలి..**



రైల్వే స్టేషన్‌లో కనీస మౌలిక వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్‌లో గల కొలాయిల నుంచి వస్తున్న తాగునీటిని తాగలేక ఇంట్ల నుంచి తాగునీటిని తీసుకు వెళ్తున్నాం. దీనికి తోడు టికెట్ కౌంటర్ ఒక ప్రక్క ప్లాట్‌ఫాం మరో పక్కన ఉండటంతో కుటుంబ సభ్యులు, చిన్న పిల్లలతో వెళ్తున్న వారి అవస్థలు తీవ్రంగా ఉంటునానయి. స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు దూరంగా ఉండడంతో పాటు మూసి ఉంచడం వల్ల నిరుపయోగంగా ఉంటున్నాయి. ప్రయాణికుల అవస్థలను దృష్టిలో ఉంచుకుని అనుకూలంగా టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి. అలాగే స్టేషన్‌లో రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించాలి. మౌలిక వసతులను కల్పించాలి.

**- ఇరుగురాల వికాస్(మందమర్రి)**

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## ప్రశాంతంగా ముగిసిన పరీక్ష

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 10 : నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించారు.జిల్లాలోని నాలుగు సెంటర్లలో పరీక్షను ( జిల్లా పరిషత్ గర్ల్ హైస్కూల్ ఖానాపూర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మల్, జుమ్మెరాత్ పేట్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల నిర్మల్) ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 617 మంది విద్యార్థులు పరీక్షకు అప్లై చేసుకోగా.. 609 మంది హాజరయ్యారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ధ పద్మ పరీక్ష పర్యవేక్షించారు.

## బెల్లంపల్లి వాసికి అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు

బెల్లంపల్లి, డిసెంబర్ 10 : పట్టణంలోని టేకులబస్తీకి చెందిన కలాలి నర్సయ్యకు జాతీయ బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు దక్కింది. ఢిల్లీలో ఆదివారం జరిగిన 39వ భారతీయ దళిత సాహిత్యం అకాడమీ సమావేశంలో ఈ మేరకు అవార్డును ప్రొఫెసర్ డాక్టర్ సుమనక్షర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ దళిత సమాజిక వర్గం, నేతకాని కులానికి చెందిన అవార్డు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.


అవార్డు అందుకుంటున్న కలాలి నర్సయ్య


పాఠశాలలో పిల్లలతో సందడి

## పాఠశాలల్లో సందడి

నిర్మల్ టౌన్, డిసెంబర్ 10 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో సండే సందడి కనిపించింది. పిల్లలను చూసేందుకు తల్లిదండ్రులకు ఆదివారం అనుమతి ఇవ్వడంతో ఆదివారం తల్లిదండ్రులు పిల్లలతో సరదాగా గడిపారు. పిల్లల యోగక్షేమాలను తెలుసుకుంటూ సందడి చేశారు.

## వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

బెజ్జూర్, డిసెంబర్ 10 : మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన నస్కూరి రజనీకాంత్ (20) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రజనీకాంత్ కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం మద్యం మత్తులోనే పురుగుల మందు తాగాడు. అనంతరం తన కుటుంబ సభ్యులకు పురుగుల మందు తాగినట్లు తెలిపాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు రజినీకాంత్‌ను చికిత్స కోసం కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మరణించాడు. ఆదివారం అతడి మేనమామ పల్లెం శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

**ఖిరిడి గ్రామంలో..**

వాంకిడి, డిసెంబర్ 10 : మండలంలోని ఖిరిడి గ్రామంలో నివాసం ఉంటున్న అదే గోపాల్ (25)తన భార్య, మామ, బామ్మర్దులు కొట్టి దుర్భాష లాడారని మనస్తాపానికి గురైన గోపాల్ ఈనెల 5న ఇంట్లో ఉన్న కంది పంటకు కొట్టే మందును తాగాడు. గమనించిన తండ్రి అదే శంకర్ హుటాహుటిన కొడుకు గోపాల్‌ను ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కాగజ్ నగర్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మంచిర్యాల ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో అదే గోపాల్ శనివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కొడుకు గోపాల్ చావుకు కారకులైన మామ మోర్లే బకీరాం, బామ్మర్దులు మోర్లే జ్ఞానేశ్వర్,కిషన్ భార్య జానుబాయ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వాంకిడి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం తండ్రి అదే శంకర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

## కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తృటిలో తప్పిన పెను ప్రమాదం

కాగజ్‌నగర్, డిసెంబర్ 10 : సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు బయలుదేరిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో ఆదివారం ఒక్కసారి పొగ మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సికింద్రాబాద్ నుంచి ఉదయం 8.30 గంటలకు బయలుదేరిన రైలు కాగజ్ నగర్ రైల్వే స్టేషన్‌కు 1.30 చేరుకోవాల్సి ఉండగా గంటన్నర ఆలస్యంగా చేరుకున్నట్లు తెలిసింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో బోగీల్లో పొగరావడంతో అప్రమత్తమైన లోకో పైలెట్ రైలును నిలిపివేశారు. ప్రయాణికులంతా భయంతో రైలు నుంచి కిందికి దిగిపోయారు. పొగ మంటలను నియంత్రించిన అనంతరం యథావిధిగా కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కాగజ్‌నగర్ చేరుకున్నది. ఈ విషయమై కాగజ్ నగర్ రైల్వే పోలీసులకు సంప్రదించగా ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం సంభవించ చలేదని స్పష్టం చేశారు.